క్లుప్తంగా

ఆటపాటలతో కూడిన విద్య అవసరం

పగిడ్యాల: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య ఎంతో అవసరమని మండల విద్యాధికారి సుభాన్ అభిప్రాయపడ్డారు. నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని బీరవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామయ్య విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో కూడిన విద్యను అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసి వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు పాయసం


విద్యార్థులకు పాయసం పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు చివరి రోజు శనివారం భానుముక్కల సర్పంచు బండ్లమూరి కృష్ణవేణి భర్త వైఎస్సార్‌సీపీ నాయకులు బండ్లమూరి వెంకటేశ్వర్లు పాయసం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం నాటి నుంచి ప్రతి రోజు దాతలు చల్లని మజ్జిగ, నిమ్మరసం, పంపిణీ చేసి విద్యార్థుల దాహార్తి తీర్చారు. చివరి రోజు కావడంతో నోరు తీపి చేయాలని పాయసం పంపిణీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వరరావు పాల్గొన్నారు.

దేవస్థానం కల్యాణకట్ట ఉద్యోగి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని కల్యాణకట్టలో ఔట్ సోర్సింగ్ కమీషన్ పద్ధతిపై పనిచేస్తున్న చెలిమెల్ల శ్రీనివాసులు శనివారం ఉదయం 6.30 గంటలకు తీవ్రంగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. శ్రీనివాసులు గత కొన్నిసంవత్సరాల నుంచి దేవస్థానం కేశఖండన శాలలో క్షవరవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని కల్యాణకట్ట నా యీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎమ్ సాయిబాబా తెలిపారు. కల్యాణకట్ట సిబ్బంది, సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి కాశీ నాధం శ్రీనివాసులు మృతి పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సంఘం తరపున తమ వంతు సహాయం చేస్తామ ని వారి కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్నసీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: స్థానిక కోర్టులో మే 13వ తేదీన జరగనున్న నేషనల్ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు కోరారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసు, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీకాదగిన క్రిమినల్ కేసులు, సివిల్, మున్సిపల్ ప్రాపర్టీ, బిల్డింగ్‌ప్లాన్ తదితర కేసుల కక్షిదారులతో మాట్లాడి పెద్ద సంఖ్యలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఏజీపీ సుధకార్‌రెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు ఎస్సైలు కృష్ణమూర్తి, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ఆశా వర్కర్ నజరున్నీసాను వేధింపులకు గురి చేసిన ఏఎన్ఎం సావిత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి, నాయకులు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నాలుగో సచివాలయంలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న నజరున్నీసా నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానిక పురభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్‌ను సీఐటీయూ నాయకులు పరామర్శించారు.

సచివాలయాల తనిఖీ


శ్రీశైలం సచివాలయం-2 లో ఐటీడీఏ పీఓ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని గ్రామ సచివాలయం 1, 2, 3 లను ఐటీడీఏ పీఓ డాక్టర్ బి. రవీంద్రారెడ్డి శనివారం తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. ప్రజల ద్వారా వచ్చిన అర్జీలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు ముందుండాలని, అలసత్వం వహించరాదని సూచించారు.

ఉద్యాన రైతుకు అండగా..

- ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పంట సేకరణ కేంద్రాలు
- నందికొట్కూరు, జూపాడుబంగ్లాలో రెండు కేంద్రాల నిర్మాణం
- త్వరలో రైతులకు అందుబాటులోకి..


జూపాడుబంగ్లాలో నిర్మాణం పూరైన కలెక్షన్ సెంటర్

జూపాడుబంగ్లా:రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పండ్లు, కూరగాయల తోట లు సాగుచేసే రైతులకు త్వరలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొనిరానుంది. ఇవి ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

ఒక్కొక్కటి రూ.15 లక్షల వ్యయంతో..

రైతుల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటి రూ.15లక్షల వ్యయంతో జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాల్లో రెండు కలెక్షన్ సెంటర్లను నిర్మించింది. జూపాడుబంగ్లా మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి కాగా, నందికొట్కూరు మండలంలో లోని 10 బొల్లవరంలో ఒకటి నిర్మించారు. యూనిట్ కాస్టు రూ.15 లక్షలు కాగా ఇందులో (75శాతం) రూ.11.25లక్షలు రాయితీ పోను, రైతు ఉత్పత్తిదారుల సంఘం(25శాతం) వాటాగా రూ.3.75లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంలో కలెక్షన్ సెంటర్లను నిర్మించారు.

దిగుబడులను నిల్వచేసుకునే వెసులుబాటు

ఈ సెంటర్లలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులు ఉత్పత్తిచేసిన కాయకూరలు, ఆకుకూరలను గ్రేడింగ్ చేసి నిల్వ ఉంచుకునే, విక్రయించుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ధరలు తగ్గిన సమయాల్లో రైతులు సంఘటితంగా ఉండి దళారుల ప్రమేయం లేకుండా దిగుబడులను విక్రయించుకోవచ్చు. అవసరమైతే వినియోగదారుడే ఈ కేంద్రాలకు వచ్చి తమకు కావలసిన నాణ్యమైన పంటల్ని కొనుక్కోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

కలెక్షన్ సెంటర్ నిర్మాణం పనులు పూర్తైనందున త్వరలో ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేనున్నట్లు జూపాడుబంగ్లా హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని, వైకేపీ ఏపీఎం అంబమ్మ తెలిపారు. గ్రామాల్లోని రైతులు రైతుమిత్ర గ్రూపులుగా ఏర్పడి వాటా మొత్తాన్ని చెల్లించటానికి ముందుకు వస్తే ప్రతి గ్రామంలో ఓ కలెక్షన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు


పట్టణంలో గౌడ్ సెంటర్‌లో అగ్నిమాపక సిబ్బంది విన్యాసం

ఆత్మకూరు: పట్టణంలోని గౌడ్ సెంటర్, రఘునాథ్ సెంటర్, నంద్యాల టర్నింగ్‌లలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం అగ్నిమాపక శాఖ అధికారులు విన్యాసాలు నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడు నాయక్ అగ్నిప్రమాదాలు ఎలా నివారించాలి, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పెద్ద పెద్ద భవనాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా మంటలు అదుపు చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం అగ్నిమాపక విన్యాసాలను సిబ్బంది ప్రదర్శించారు. సులేమాన్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, రింగ్‌పార్క్, బస్టాండ్ ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఫైర్ ఆఫీసర్ బి.గుణశేఖర్‌రెడ్డి, లీడింగ్‌ఫైర్‌మెన్ పి.అయుబ్‌ఖాన్, ఆపరేటర్ ఎస్ .వెంకటేశ్వర్లు, ఫైర్‌మెన్‌లు డి.రమేష్, కె.సురేష్‌కుమార్, పి.బుచ్చయ్య, హోంగార్డులు పాల్గొన్నారు.

7న విగ్రహ ప్రతిష్ఠ

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అలువేలు మంగ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మే 7వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను కర్నూలు లలితా పీఠాధిపతి మేడ సుబ్రహ్మణ్యం స్వామి చేతుల మీదుగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ వెంకట సుబ్బయ్య, బొగ్గారపు లక్ష్మీనారాయణ, మారేపాటి రమణయ్య, సంజీవరాయ ప్రసాద్, తాళ్లూరి రవికుమార్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమం


ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 14, 16 వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసిన పథకాలను ప్రజలకు వివరించారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధిసాధ్యం

మిడుతూరు:జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య అన్నారు. శనివారం మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో జగనన్నే మన భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు

పాములపాడు: మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం కొనసాగించారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం,ఎన్. ఘణపురం తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో జగనన్న ఇళ్లస్థలాల మండల కో-ఆర్డీనేటర్ గనమల పరశురాముడు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, మౌలాలి, శేషిరెడ్డి ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాల వివరించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వ్యతిరేకి చంద్రబాబు

- మళ్లీ సీఎం కావాలని వైఎస్ జగనన్నను దీవించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆర్థర్


10 బొల్లవరం గ్రామంలో ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వ్యతిరేకి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే తొగరు ఆర్థర్ అన్నారు. శనివారం పట్టణంలోని 10వ సచివాల యం పరిధిలో బైరెడ్డి శేషశయనరెడ్డి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. వైఎస్ జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని ప్రజలు ఆయనను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు సీఎం వైఎస్‌జగనన్న వెంట ఉన్నారని ఓర్వలేక చంద్రబాబు విషం చిమ్ముతున్నారన్నారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న కాలనీల నిర్మాణాలు చూసి చంద్రబాబుకు వణుకుపట్టిందన్నారు. అర్హులైన పేదలందరికీ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, డీఈ నబి రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు సుమలత, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు విక్టర్,ఆర్ట్ శ్రీను, గోల, గౌడు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు అవగాహన కల్పించాలి

నందికొట్కూరు: మహిళా రైతులకు వ్యవసాయ అధికారులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఆర్థర్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామంలో భ్రమరాంబిక మహిళా శక్తి రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళా రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. నాలుగేళ్ల కాలంలో భ్రమరాంబిక మహిళా శక్తి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎంతో అభివృద్ధిలో రాణించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. పవర్ స్ప్రేయర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్ టార్పాలిన్స్, మామిడి పండ్ల అమ్మకం, పండ్ల కిట్ల అమ్మకం ద్వారా రూ, 30,4477 టర్నోవర్ సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళా రైతులను వ్యవసాయం రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిచేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, గ్రామ సర్పంచు జయలక్ష్మిదేవమ్మ, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుజాతమ్మ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు, మహిళా రైతు సంఘం అధ్యక్షురాలు మల్లేశ్వరి, సహకార సొసైటి అధ్యక్షులు హరిసర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లపై విస్తృత ప్రచారం

- ఈనెల 25 నుంచే అందబాటులో టికెట్లు
- శ్రీశైల ఈఓ లవన్న


సమావేశంలో సూచనలు చేస్తున్న దేవస్థానం ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మే 1వ తేదీ నుంచి అమలు కానున్న ఆన్‌లైన్ దర్శన టికెట్లపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు ఈఓ లవన్న పేర్కొన్నారు. ఈ విషయంపై శనివారం భ్రమరాంబా అతిథి గృహంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మే 1 నుంచి అన్ని ఆర్జితసేవలు, స్వామిఅమ్మవార్ల స్పర్శ దర్శనం టికెట్లను భక్తులకు ఆన్‌లైన్ ద్వారానే జారీ చేయాలని నిర్ణయించిన సంగతి విదితమే. ఈ మేరకు అధికారులతో ఈఓ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevastanam.org లో టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్ల పొందడంపై అవగాహన కల్పించేందుకు క్షేత్ర పరిధిలోని ప్రధాన కూడళ్లు, అన్నసత్రాల వద్ద సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో, దేవస్థానం శ్రీశైలం టీవీ చానెల్‌లో కూడా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. స్పర్శదర్శనం కూడా నిర్దిష్ట వేళల్లోనే కల్పించే విషయాన్ని భక్తులకు తెలియజేయాలని సూచించారు. ఆర్జిత సేవా భక్తులు, స్పర్శదర్శనం టికెట్ పొందిన భక్తులు విధిగా టికెట్ ప్రింట్ కాపీని, ఆధార్ గుర్తింపు కార్డులను తీసుకు రావాల్సి ఉంటుందని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా పొందిన టికెట్లను స్కానింగ్ జరిపిన తర్వాత ఆధార్ గుర్తింపు అనుసరించి భక్తులకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఈఓ గోసంరక్షణ శాలను పరిశీలించి, సిబ్బందికి పలుసూచనలిచ్చారు. సమావేశంలో సహాయ కమిషనర్ హెచ్ జి వెంకటేష్, ఏఈఓ ఎమ్ ఫణీధర్ ప్రసాద్, మోహన్, హరిదాసు, శ్రీశైలం ప్రభ సంపాదకులు డా.పి. అనిల్‌కుమార్, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు మధుసూధన్‌రెడ్డి , ఉమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు చెంతకే భూసార పరీక్షలు


నందికొట్కూరు సమీపంలోని పొలాల్లో మట్టిని సేకరిస్తున్న అధికారులు

నందికొట్కూరు: రైతు చెంతకే భూసార పరీక్షలు ప్రభుత్వం తెచ్చిందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మంజువాణి అన్నారు. శనివారం పట్టణంలోని ఆత్మ భవనంలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పట్టణ సమీపంలోని పొలాల్లోని మట్టిని పరీక్షల కోసం అధికారులు సేకరించారు. ఆమె మాట్లాడుతూ స్పెషల్ కమిషనర్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు ఈ నెల రెండోవ వారాన్ని మట్టి పరీక్ష శిక్షణ వారంగా నామకరణం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఈ శ్రావణి, ఆర్‌బీకే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండల వ్యవసాయ అధికారిణి కే. సునీత ఆధ్వర్యంలో నేల ఆరోగ్యం, మట్టి పరీక్షలపై రైతు భరోసా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మహానంది: జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి , ఏఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం తమ్మడపల్లె గ్రామంలో మట్టినమూనాల సేకరణ, భూసార పరీక్షలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

పగిడ్యాల: ఏఓ విజయ్‌జ్యోతుకుమార్ ఆధ్వర్యంలో నేల ఆరోగ్యం- మట్టి పరీక్షల పై శిక్షణా కార్యక్రమాన్ని పగిడ్యాల-1 సచివాలయ పరిధిలో నిర్వహించారు.

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు


మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయులు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ ఆంజనేయులు, ఎంపీపీ తిరుపాలమ్మ తెలిపారు. మండలంలోని కరివేనలో శనివారం రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి సలహా మండలి సమావేశం మండల అధ్యక్షుడు కొండలరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు జీలుగ విత్తనాలతో పాటు పచ్చిరొట్ట ఎరువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. యంత్ర పరికరాలు కూడా రాయితీపై పంపిణీ చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

18 నుంచి మొబైల్ ఆధార్ సేవలు

పగిడ్యాల: మండలంలో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ సేవలను అందించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. 18న పగిడ్యాల-1, లక్ష్మాపురం-3 , 19న పగిడ్యాల-2, లక్ష్మాపురం -2 , 20న పగిడ్యాల-3, లక్ష్మాపురం-1, 26న నెహ్రూనగర్-1, కొత్త ముచ్చుమర్రి, 27న నెహ్రూనగర్-2, పాతముచ్చు మర్రి సచివాలయాలలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన కోతి

వెలుగోడు: కోతి చేసిన పనికి ఓ వ్యక్తి ప్రాణాలు పోయిన ఘటన వెలుగోడులో చోటు చేసుకుంది. వెలుగోడు పట్టణానికి చెందిన షేక్ రఫీక్(45) తన ఇంటికి వెళ్తుండగా షరీఫ్ అనే వ్యక్తి ఇంటిపై కోతులు కొట్లాడుతూ సిమెంట్ ఇటుకను కిందికి పడేశాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రఫీక్ తలపై అది పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమి త్తం నంద్యాల ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మరణించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

నందికొట్కూరు: కుటుంబ సమస్యలతో విసుగు చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపిన మేరకు పట్టణంలోని బైరెడ్డి నగర్‌కు చెందిన షేక్ నిజాముద్దీన్, రిజ్వాన్ దంపతుల కుమారుడు మహమ్మద్ రఫికి 12 ఏళ్ల క్రితం కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన సల్మాబీతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే 2017లో డేరంగుల స్మృతిని రెండోవ వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా రు. కుటుంబ సమస్యలతో పూర్తిగా విసిగిపోయి గురువారం ఇంట్లోనే కుటుంబ సభ్యుల ఎదుట పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఉమావాణి ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ

జూపాడుబంగ్లా: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, ఆడపడచు వేధించటంతో తన కుమార్తె మంగలి ఉమావాణి(21) మానసికావేదనకు లోనై ఈనెల 13న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి మంగలి సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 304-బీ, రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద మృతురాలి భర్త మంగలి ఎల్లమద్దయ్య, మామ మంగలి పెద్దశేషన్న, అత్త మంగలి కృష్ణవేణమ్మ, ఆడపడచు మంగలి ఎల్లమద్దమ్మలపై కేసునమోదు చేసుకొని ఎస్ఐ వెంకటసుబ్బయ్య దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలికి వివాహమై కేవలం ఏడాది కావటంతో విషయాన్ని ఎస్ఐ సీఐ, డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ మేరకు శనివారం ఆత్మకూరు డీఎస్పీ శృతి పర్యవేక్షణలో మృతదేహానికి నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ తరిగోపుల గ్రామానికి చేరుకొని మృతురాలు ఆత్మహత్య చేసుకొన్న ఇంటిని, సంఘటనను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి సంఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. మరోపర్యాయం డీఎస్పీ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపనున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

శింగవరంలో చోరీ

బండిఆత్మకూరు: శింగవరం గ్రామంలోని బస్టాండ్ వద్ద డీజిల్ బంకులో శుక్రవారం రాత్రి సుమారు రూ. 30 వేలు విలువ చేసే డీజిల్, టైర్లు అపహరణకు గురయ్యాయి. సోమయాజులపల్లె గ్రామానికి చెందిన సుబ్బమ్మ శింగవరం బస్టాండ్‌లో దుకాణం ఏర్పాటు చేసుకొని డీజిల్, టైర్లు విక్రయించుకొని జీవనం సాగిస్తుంది. అయితే అగంతకులు శుక్రవారం రాత్రి బంకు తాళం పగులకొట్టి అందులోని క్యాన్లలో ఉన్న డీజిల్, టైర్లు తీసుకెళ్లారు. అయితే రాత్రి 11 గంటల సమయంలో డీజిల్ కావాలని కొందరు వ్యక్తులు అడగడంతో సుబ్బమ్మ బంకు వద్దకు వెళ్లింది. దీంతో చోరీ జరిగిన విషాయన్ని గుర్తించి శనివారం బండిఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బుక్కాపురంలో అగ్ని ప్రమాదం

మహానంది: బుక్కాపురం గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంబవించి గాజుల శివుడు నివాసముంటున్న ఇల్లు కాలిబుడిదయ్యింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సుధాకర్, సంజీవరాయుడు, నాగేంద్ర గ్రామానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మలు ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

- అన్ని చోట్లా పరీక్షలు ప్రశాంతంగా
- ఆనందంతో ఇంటిముఖం పట్టిన విద్యార్థులు
- ఉత్తీర్ణత సాధిస్తామంటున్న అధికశాతం విద్యార్థులు


గాజులపల్లె కేంద్రం నుంచి ఆనందంగా వెళ్తున్న విద్యార్థులు


కొత్తపల్లిలో అస్వస్థతకు గురైన విద్యార్థిని ఉషాకుమారికి వైద్యం అందిస్తున్న వైద్యులు

జూపాడుబంగ్లా: పన్నెండు రోజులపాటు ఉత్కంఠ భరితంగా కొనసాగిన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఏప్రిల్ 3న పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 480 మంది విద్యార్థులు ఆరు ప్రశ్నాపత్రాలతో 12 రోజుల పాటు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియటంతో ఇన్విజిలేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ ఇంటిదారి పట్టారు. విద్యార్థుల పరీక్షా ఫలితాలు నెలరోజుల్లో వెలువరించే అవకాశాలున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటుండగా, వార్షిక పరీక్షల్లో అధికశాతం ఉత్తీర్ణత సాధిస్తామని విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గాజులపల్లెలో..

మహానంది: గాజులపల్లెలో ఏర్పాటు చేసిన పది పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జెడ్పీ పాఠశాలలో 166 మంది విద్యార్థులకు 164, శ్రీస్తుజ్యోతి పాఠశాలలో 154 మంది విద్యార్థులకు 147 మంది విద్యార్థులు హాజరైనట్లు స్క్వాడ్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఒకరినొకరు వీడుకోలు చెప్పుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షల నిర్వహకులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఎక్కడా మాస్‌కాపీయింగ్ జరకుండా నిర్వహణాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. చివరిరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 195 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 9 మంది, అదేవిధంగా కేజీబీవీ పరీక్షా కేంద్రంలో 96 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు గైహాజరు అయినట్లు పరీక్షల నిర్వహణాధికారి మోహన్‌బాబు, డిపార్టమెంటల్ అధికారి గాలీబ్ అహమ్మద్ తెలిపారు.

విద్యార్థిని స్వల్ప అస్వస్థత

స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థిని ఉషాకుమారి స్వల్ప అస్వస్థతకు గురైంది. పరీక్షమధ్యలో కళ్లు తిరిగి పడిపోయింది. అక్కడున్న వైద్యసిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారుల సమక్షంలో విద్యార్థిని దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యుడు వినోద్‌కుమార్ ప్రథమ చికిత్స అందించారు. వైద్యం అందించిన తర్వాత విద్యార్థినిని 108 అంబులెన్స్‌లో పరీక్షాకేంద్రానికి తీసుకువెళ్లి మరల పరీక్ష పూర్తి చేయించారు.

మిడుతూరులో..

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 195 మంది విద్యార్థులకు 185 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి మోహన్‌రావు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 214 మంది విద్యార్థులకు 208 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి సలీంబాషా వెల్లడించారు. పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంలో మునిగితేలారు.